GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in


# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 313 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | గురువారం 04-07-2024 | పేజీలు : 3

## కాంగ్రెస్‌లో చేరిన కేకే..



**టి మీడియా, జూలై 3, ఢిల్లీ:** బీఆర్ఎస్ కి మరో బిగ్ షాక్ తగిలింది. గులాబీ అధినేత కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న సీనియర్ రాజకీయ నేత, రాజ్యసభ ఎంపీ కే కేశవరావు (కేకే) కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ ఖర్గే నివాసంలో ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ సమక్షంలో కేకే లాంఛనంగా కాంగ్రెస్‌లో జాయిన్ అయ్యారు.ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అగ్రనేతల సమక్షంలో కేకే తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. అంతకుముందు కేకే సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఢిల్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అగ్రనేతలతో చర్చించారు. అనంతరం ఖర్గే నివాసానికి చేరుకుని ఆయన సమక్షంలో హస్తం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాగా, బీఆర్ఎస్‌లో కీలక నేతగా ఉన్న కేకే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమితో గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పిన విషయం తెలిసిందే.

## జైలుకెళ్లి వచ్చిన కానిస్టేబుల్ ...

# భోలే బాబాగా అవతారం





- 28 ఏళ్ల కింద సస్పెండ్, సర్వీస్ నుంచి డిస్మిస్
- 121మంది మృతి కారణమైన బాబాపై పలు కేసులు
- ఎఫ్ఐఆర్‌లో కనిపించని పేరు

**యుపిలో 121మంది మృతికి కారణమైన స్వయం ప్రకటిత బోలే బాబా అలియాస్ సూరజ్ పాల్ నేర చరిత్రను కలిగి ఉన్నాడు. అతనిపై లైంగిక వేధింపులతో పాటు పలు కేసులు నమోదైనట్లు పోలీసులు బుధవారం ప్రకటించారు. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో మంగళవారం సత్సంగ్ పేరిట నిర్వహించిన మతపరమైన కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో 121 మంది మరణించగా, వందలాది మందికి గాయాలైన సంగతి తెలిసిందే.**

**టీ మీడియా, జూలై 3, న్యూఢిల్లీ :** యుపిలో 121మంది మృతికి కారణమైన స్వయం ప్రకటిత బోలే బాబా అలియాస్ సూరజ్ పాల్ నేర చరిత్రను కలిగి ఉన్నాడు. అతనిపై లైంగిక వేధింపులతో పాటు పలు కేసులు నమోదైనట్లు పోలీసులు బుధవారం ప్రకటించారు. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో మంగళవారం సత్సంగ్ పేరిట నిర్వహించిన మతపరమైన కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో 121 మంది మరణించగా, వందలాది మందికి గాయాలైన సంగతి తెలిసిందే. ఆగ్రా, ఇటావా, కస్గంజ్, ఫరూఖాబాద్ మరియు రాజస్థాన్‌లో సూరజ్‌పాల్‌పై పలు కేసులు నమోదయ్యాయి.సూరజ్‌పాల్ కాస్గంజ్‌లోని బహదూర్ నగర్‌లో జన్మించాడు. కొన్నాళ్లపాటు పోలీస్ అధికారిగా పనిచేశాడు. 1997లో లైంగిక వేధింపుల కేసులో జైలు శిక్ష కూడా అనుభవించాడు. విడుదలైన తర్వాత తన పూర్వీకుల గ్రామానికి చేరుకున్నాడు. అనంతరం తనన తాను సాకర్ విశ్వ హరి బాబా అలియాస్ బోలేబాబా పేరుతో ఆశ్రయం నిర్మించి, ప్రజలను ఆకర్షించాడు.కస్గంజ్ సమీపంలోని బహదూర్ నగర్‌లో సురజ్ పాల్ జన్మించారు. అనంతరం పోలీస్ శాఖలో చేరారు. విధి నిర్వహణలో భాగంగా మహిళలను లైంగిక వేధింపులకు గురి చేశారు. దీంతో అతడిపై కేసు నమోదు కావడంతో.. జైలు శిక్ష సైతం అనుభవించారు. ఆ తర్వాత నుంచి విడుదలైన పాల్.. తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. అనంతరం సాకర్ విశ్వ హరిబాబాగా అవతారమెత్తాడు. తన పూర్వీకులు నివసించిన గ్రామంలోనే ఓ ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకొని... భక్తులను ఆకట్టుకోనేలా సత్సంగం పేరిట ప్రసంగాలను ప్రారంభించారు. దీంతో బాబాకు సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లోనే కాదు.. బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఆయనకు భక్తులు విస్తరించారు.

### ఎఫ్ఐఆర్‌లో కనిపించని బోలే బాబా పేరు ..

అయితే ఎఫ్ఐఆర్‌లో ఈ బాబాపేరు నమోదు కాకపోవడం గమనార్హం. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నట్లు సమాచారం. 80,000 మంది హాజరవుతారని సత్సంగ్ నిర్వాహకులు అనుమతి తీసుకున్నాని, కానీ రెండున్నర లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రధాన నిర్వాహకుడు దేవ్ ప్రకాష్ మధుకర్‌తో పాటు మరో నిందితుని పేర్లను మాత్రమే ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. కార్యక్రమం అనంతరం బోలేబాబా పాదధూళి పేరుతో మట్టిని సేకరించేందుకు ప్రజలు సూరజ్‌పాల్ కారువెనుక పరుగులు తీశారు. అయితే అతని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు ప్రజలను కర్రలతో కొట్టడంతో తొక్కిసలాట జరిగిందని సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్ నివేదిక పేర్కొంది. చాలా మంది కింద పడిపోవడంతో మరికొందరు వారిపై నుండి పరుగులు తీశారు. చాలా మంది ఊపిరాడక అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఈ తొక్కిసలాటలో మరణించిన వారిలో అత్యధిక శాతం మంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. ఈ భారీ సభ వద్ద భద్రత కోసం కేవలం 40 మంది పోలీసులు మాత్రమే ఉన్నారని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు.బోలేబాబాను అరెస్ట్ ఎందుకు అరెస్ట్ చేయలేదన్న ప్రశ్నకు స్టేట్ పోలీస్ చీఫ్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ.. దర్యాప్తు జరుగుతోందని, తక్షణ చర్యలతో విచారణను ప్రభావితం చేయలనుకోవడం లేదని అన్నారు. పూర్తి విచారణ అనంతరం వాస్తవాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు.

### నిర్వాహకుల కోసం వెతుకులాట

'సత్సంగ్ కార్యక్రమాన్ని నిర్వహించిన కమిటీపై, బాబాపై కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశాం.' అని అలీగఢ్ ఐజీ శలభ్ మాథుర్ చెప్పారు.ఈ కేసు ఎఫ్ఐఆర్ రిపోర్టులో కూడా నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఉంది. ఈ దుర్ఘటనకు కారణాలను వివరిస్తూ భోలే బాబా ప్రవచనాలను ప్రస్తావించారు. దీన్ని ఆధారంగా చేసుకుని పోలీసులు వారిపై విచారణ చేపట్టి, వారి కోసం వెతుకుతున్నట్లు చెప్పారు.'కమిటీ నిర్వాహకులు, భోలే బాబా కోసం వెతుకుతున్నాం. అందరి మొబైల్ ఫోన్లు స్విచాఫ్‌లో ఉన్నాయి. అందుకే, ప్రతి ఒక్కరి గురించి సరైన, కచ్చితమైన సమాచారాన్ని సేకరించలేకపోతున్నాం." అని శలభ్ మాథుర్ తెలిపారు.

## హామీలు అమలుకు కట్టుబడి ఉన్నాం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




**టీ మీడియా, జులై 3, హైదరాబాద్ బ్యూరో :** ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గాంధీ భవన్ లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ధర్మబద్ధంగా ప్రతి పైసాను ఖర్చుపెట్టాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. రైతు భరోసాపై విధి విధానాలు రూపొందిస్తున్నాం.. అందరి అభిప్రాయాలు తీసుకుంటాం. సంపద సృష్టిస్తాం.. ప్రజలకు పంచుతాం" అని భట్టి అన్నారు. రుణమాఫీపై బీఆర్ఎస్ డ్రామాలాడుతోందని భట్టి మండిపడ్డారు. త్వరలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, అసెంబ్లీ సమావేశాల్లో రైతు భరోసా ప్రకటన చేస్తామని తెలిపారు. రూ.లక్ష రుణమాఫీ చేస్తామని ఐదేళ్లు కాలయాపన చేసిన భారాస నేతలు మమ్మల్ని రుణమాఫీ ఎప్పుడు చేస్తారని ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు.రైతు భరోసాపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీలో మా సొంత నిర్ణయాలు ఉండవు. అన్ని జిల్లాల్లో ప్రజలందరితో చర్చించిన తర్వాత ఓ నివేదిక తయారు చేస్తాం. దానిపై అసెంబ్లీలో చర్చ పెట్టిన తర్వాత విధివిధానాల ఖరారు ఉంటుంది. సంపద సృష్టించి ప్రజలకు పంచాలన్నదే మా ఆలోచన. రైతులు, పన్ను చెల్లింపుదారులు, మీడియా మిత్రులతో మాట్లాడి దీనిపై నిర్ణయం తీసుకుంటాం" అని భట్టి తెలిపారు.ఏడు మండలాల కోసం బీఆర్ఎస్ దీక్ష చేయాలని డిమాండ్ చేశారు.. ఏడు మండలాలు పోవడానికి కారణం బీఆర్ఎస్, బీజేపీనే అంటూ ఆరోపించారు. పదేండ్ల పెండింగ్ సమస్యలను ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చిస్తారని వెల్లడించారు. . విభజన చట్టంలో ఏడు మండలాల ప్రస్తావన లేదని, . బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆర్డినెన్స్‌తో ఏడు మండలాలను ఏపీలో కలిపారన్నారు. ఏడు మండలాల కోసం పోరాటం చేస్తానని అసెంబ్లీలో చెప్పిన కేసీఆర్ ఏమయ్యారంటూ భట్టి ప్రశ్నించారు."క్యాబినెట్ విస్తరణ పూర్తిగా అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది. పీసీసీ నూతన చీఫ్ విషయంలో కసరత్తు కొనసాగుతుంది. త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం. పదిహేనేండ్లు మేమే అధికారంలో ఉంటామని చెపుతున్న కేసీఆర్‌వి కల్లిబొల్లి కబుర్లే. రైతు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం.. పుట్టింది బతకడానికి.. చావడానికి కాదు. ఆత్మహత్య వెనుక ఎవరున్నారనే దర్యాప్తు కొనసాగుతోంది. ఆత్మహత్య వెనక ఎవరున్నా విడిచిపెట్టేది లేదు" అని భట్టి విక్రమార్క అన్నారు.

## తీర ప్రాంతాన్ని పరిశీలించిన

## ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్



**టీ మీడియా, జూలై 3, కాకినాడ ప్రతినిధి (యు.కొత్తపల్లి) :** ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ బుధవారం ఉప్పాడ తీరంతో సముద్రపు కోతకు గురయిన ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ మారీ టైమ్ బోర్డు, కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వ శాఖ (ఎర్త్ సైన్స్ మినిస్ట్రి) అధికారులు, రెవెన్యూ అధికారులతో చర్చించారు. సముద్రపు కోతకు గల కారణాలు, నివారణ ఉపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఉప్పాడ తీరంలోనే సముద్రం ఎందుకు ముందుకు వస్తోంది, దీనికి గల కారణాలు, తీరాన్ని కోతకు గురి కాకుండా చేయాల్సిన మార్గాలు అన్వేషించాలని అధికారులకు పవన్ సూచించారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, దీనిపై శాస్త్రీయంగా సర్వే నిర్వహించి పనులు మొదలు పెడదామని చెప్పారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఉప్పాడ గ్రామ తీర ప్రాంతంలో మొత్తం 84 ఎకరాల విస్తీర్ణంతో భూమి సముద్రంలో కలిసిపోయిందని జిల్లా సర్వేయర్ లక్ష్మీ నారాయణ తెలిపారు. 60 ఎకరాలు కోతకు గురయ్యాక సర్వే ప్రారంభించినట్టు, సర్వే ప్రారంభించిన తర్వాత మరో 20 ఎకరాలు సముద్రంలోకి వెళ్లిపోయిన విషయాన్ని వివరించారు. మొత్తం యు.కొత్తపల్లి మండల పరిధిలోని 8 తీర ప్రాంత గ్రామాల్లో 1360 ఎకరాలు కోతకు గురైన విషయాన్ని తెలుసుకుని పవన్ కల్యాణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చెన్నై నుంచి ఉప్పాడ తీర ప్రాంత కోతపై పరిశోధన జరిపేందుకు వచ్చిన కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వశాఖ అధికారులు, మారిటైం బోర్డు అధికారులను సముద్రపు కోతపై పూర్తి స్థాయిలో అధ్యయనం జరపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎంపీ ఉదరు శ్రీనివాస్, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ వర్మ, జనసేన సమన్వయకర్త మరెడ్డి శ్రీనివాస్‌పాల్గొన్నారు.


## చర్మవ్యాధులతో బాధపడుతున్న చిన్నారులు



**టీ మీడియా, జులై 3, గాజా :** ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధంతో గాజాలోని చిన్నారుల భవిత అస్తవ్యస్తమౌతోంది. తల్లిదండ్రుల సంరక్షణలో, పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాల్సిన చిన్నారులు సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. అపరిశుభ్ర వాతావరణంలోనే, నేలపైనే నిద్రిస్తున్నారు. దీంతో గాజాలోని పిల్లలు ప్రమాదకరమైన చర్మ వ్యాధుల బారిన పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) హెచ్చరించింది.గాజాపై ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించినప్పటి నుండి 1,50,000 మందికి పైగా ప్రజలు చర్మ వ్యాధులతో బాధపడుతున్నట్లు డబ్ల్యుహెచ్ఒ తెలిపింది. 96,417 గజ్జి కేసులు, 9,274 చికెన్‌పాక్స్ కేసులు, 60,130 స్కిన్ రాషెస్ కేసులు, 10,038 ఎర్రటి దద్దుర్లు (ఇంపెటిగో) కేసులు ఉన్నట్లు డబ్ల్యుహెచ్ఒ ప్రకటించింది. గజ్జి, చికెన్ పాక్స్ ముఖ్యంగా తీర ప్రాంత పాలస్తీనా భూభాగంలో విస్తృతంగా వ్యాపిస్తున్నాయని డెయిర్ ఎల్ -బాలా క్యాంప్‌లో తాత్కాలిక క్లినిక్‌ని నడుపుతున్న ఫార్మాసిస్ట్ సమీ హమీద్ పేర్కొన్నారు. మెడిసిన్స్ కొరత కారణంగా ఇవి తీవ్రంగా వ్యాపిస్తున్నాయని అన్నారు.వేడి వాతావరణం, అపరిశుభ్రమైన నీటితో చిన్నారుల్లో ఇతర వ్యాధులు కూడా విజృంభించే అవకాశం ఉందని హెచ్చరించింది. 4,85,000 డయేరియా కేసులు నమోదైనట్లు డబ్ల్యుహెచ్ఒ ఓ నివేదికలో తెలిపింది. ప్రమాదకరమైన లీష్మానియా వ్యాధి కూడా వ్యాపించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే గాజా చిన్నారులు ఈ ముప్పును ఎదుర్కొనే అవకాశం ఉందని, పోషకాహార లోపంతో రోగనిరోధక వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమౌతోందని అన్నారు. పారిశుధ్యవ్యవస్థ సరిగా లేకపోవడంతో తాత్కాలిక గుడారాల మధ్య కాలువల్లోకి మురుగునీరు ప్రవహిస్తోందని, దీంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించింది.

## ప్రతిపక్షాలతో కలిసి వాకౌట్ చేసిన

## బీజేపీ మిత్ర పక్షం



**టి మీడియా జులై 3. న్యూఢిల్లీ:** నిన్నటి వరకు బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న బిజూ జనతాదళ్ (బీజేడీ) తన తీరును మార్చుకున్నది. ఇకపై పార్లమెంట్‌లో బీజేపీకి మద్దతు ఇవ్వకూడదని నిర్ణయించింది. తాజాగా ప్రతిపక్షాల చెంతకు చేరింది. వారితో కలిసి రాజ్యసభ నుంచి వాకౌట్ చేసింది. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటి వరకు బీజేడీ మద్దతు ఇచ్చింది. ప్రధాని మోడీ రెండో ప్రభుత్వం హయాంలో పలు కీలక బిల్లుల ఆమోదానికి సహకరించింది. జమ్మూకశ్మీర్ ప్రత్యేక హోదాను రద్దు చేసి రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన బిల్లు, ఉగ్రవాద నిరోధక చట్టం (యూఏపీఏ), సమాచార హక్కు చట్టానికి సవరణలు, ఢిల్లీ అధికారులపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు పూర్తి నియంత్రణ కల్పించిన చట్టం వంటి అనేక వివాదస్పద బిల్లులకు పూర్తి మద్దతు ఇచ్చింది. అత్యవసర సమయంలో బీజేపీకి అత్యున్నత మిత్రపక్షంగా బీజేడీ వ్యవహరించింది. కాగా, 24 ఏళ్ల పాటు ఒడిశాకు సీఎంగా ఉన్న నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ ఇటీవల జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభావాన్ని చవి చూసింది. 12 ఎంపీ సీట్లలో ఓటమితోపాటు ఒడిశాలో అధికారాన్ని కోల్పోయింది. దీంతో ఒడిశాలో చాలా కాలం తర్వాత బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో బీజేడీ తన తీరును మార్చుకున్నది. ఇకపై పార్లమెంట్‌లో బీజేపీకి మద్దతు ఇవ్వకూడదని నిర్ణయించింది. ప్రతిపక్షాలతో కలిసి బీజేపీకి వ్యతిరేకంగా గళమెత్తింది. బుధవారం రాజ్యసభలో ప్రధాని మాట్లాడారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సమాధానం ఇచ్చిన ఆయన యూపీఏ మాజీ చైర్‌పర్సన్ సోనియా గాంధీపై విమర్శలు చేశారు. 'ఈ వ్యక్తులు ఆటో పైలట్, రిమోట్ పైలట్‌తో ప్రభుత్వాన్ని నడపడానికి అలవాటు పడ్డారు. వారికి పని చేయడంపై నమ్మకం లేదు, ఎలా వేచి ఉండాలో వారికి తెలుసు' అని విమర్శించారు. దీంతో ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున నిరసన తెలిపాయి. మల్లికార్జున్ ఖర్గే జోక్యానికి రాజ్యసభ ఛైర్మన్ అనుమతించలేదు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి.

# లైంగిక వేధింపులకు పాల్పడితే, కఠిన చర్యలు తప్పవు

**-పోత్కపెల్లి ఎస్ఐ అశోక్ రెడ్డి.**



**టీ మీడియా ,జులై 3, ఓదెల :**పెద్దపెల్లి జిల్లా,ఓదెల మండల కేంద్రంలో, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం, పోత్కపల్లి,ఎస్ఐ అశోక్ రెడ్డి, ఆధ్వర్యంలో, రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్,ఐజీ, అదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం, పోత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనిఓదెల గ్రామము లో పెద్దపల్లి డి.సి.పి మేడం, పెద్దపల్లి ఏసిపి కృష్ణ, సుల్తానాబాద్ సి ఐ సుబ్బారెడ్డి, పర్యవేక్షణలో ఎస్ ఐ అశోక్ రెడ్డి,కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంనిర్వహించడమైనది,ఈ సందర్భంగా ఎస్ ఐ,మాట్లాడుతూ మైనర్ బాలికల పై లైంగిక వేదింపులకు పాల్పడితే( చిన్న పిల్లలపై లైంగిక నేరల చట్టం ప్రకారం,భారీ శిక్షలు పడుతాయి అని, పి ఓ సి ఎస్ ఓ,చట్టం ప్రకారం శిక్షలు కటినంగా ఉంటాయి జీవిత కాల శిక్ష మరియు ఉరి శిక్ష పడుతుంది అని అదే విధంగా మహిళల పై లైంగిక వేదింపులకు పాల్పడితే కనీసం పది సంవత్సరాలు, గరిష్టంగా జీవిత కాల శిక్ష, ఉరి శిక్ష పడుతుంది అని తెలుపుతూ తమ పిల్లలను ఎల్లప్పుడూ నేరస్థల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందని పిల్లలను న్ ా ్ ల ు ్ ు తీసుకెళ్లేటప్పుడు మరియు తీసుకొని వచ్చేటప్పుడు తప్పకుండా తల్లిదండ్రులు లేదా ఇంటి పెద్ద వారు జాగ్రత్త వహించాలి అని ఎవరైనా తమ పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన మరియు చూసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలియజేసినారు అంతేకాక తమ తమ గ్రామాలలో గంజాయి సేవించే వారి వివరాలను మరియు మద్యం తాగి రోడ్ల మీదికి వచ్చి ప్రజలకు ఇబ్బందులు కలగజేయు ఆకతాయిల గురించిన సమాచారం పోలీసులకు ఇవ్వవలసిందిగా అట్టి సమాచారము ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంటాయని తెలియజేయడం జరిగిందికార్యక్రమం లో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు 100 మంది, పాల్గొన్నారు.

## అసంపూర్తి నిర్మాణంలో ఉన్న రోడ్లను పరిశీలించిన జిల్లెల



**టీ మీడియా, జులై 3, వనపర్తి బ్యూరో :** వనపర్తి మున్సిపల్ పరిధిలో చిట్యాల రోడ్డులో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న రోడ్లను పరిశీలించిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి . ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా రోజుల నుండి కొన్ని కారణాల వల్ల రోడ్డు నిర్మాణంలో ఆలస్యమైందని వెంటనే సమస్య పరిష్కారం చేసి పనులు ప్రారంభిస్తామని చిన్నారెడ్డి అన్నారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బి కృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు పర్శరాం కుమార్, మాలగుట్ట యాది, కోళ్ల వెంకటేష్, చెన్న రాములు, దివాకర్, అక్షయ్, రోహిత్, గోపాల్పేట మండల అధ్యక్షులు గణేష్ గౌడ్, పెబ్బేరు మండలాధ్యక్షులు విజేందర్ రెడ్డి, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షులు రాములు, వనపర్తి మండల అధ్యక్షులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## మణిపూర్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు

**టి మీడియా, జూలై 3,మణిపూర్ :** మణిపూర్‌ను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరిపిలేని భారీ వర్షాలతో జనజీవనం స్తంభించింది. పలుప్రాంతాలు జలదిగ్బంధమయ్యాయి. దీంతో %ా% ఆ రాష్ట్ర గవర్నర్ అనుసూయ ఉయికే బుధవారం రాష్ట్రవ్యాప్తంగా సెలవు ప్రకటించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, అటానమస్ బాడీలు, ప్రభుత్వ పరిధిలోని సొసైటీలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు, స్కూల్స్, కాలేజీలు మూతపడ్డాయి. మరోవైపు మణిపూర్ విద్యాశాఖ డైరెక్టరేట్ కూడా రాష్ట్రంలో వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యగా జూలై 3, 4 తేదీల్లో అన్ని పాఠశాలలకు సెలవులు ఇస్తున్నట్లు ప్రకటించారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మణిపూర్‌లోని పలు నదులు, సరస్సులు, వాగులు, వంకలు పోటెత్తుతున్నాయి. ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, కాంగ్‌పోక్పి, సేనాపతి, తౌబాల్, బిష్ణుపూర్ జిల్లాల్లోని పలు ప్రాంతాలను కూడా వరదలు ముంచెత్తాయి. మణిపూర్ రాష్ట్రంలోని ప్రధాన నదుల నీటి మట్టాలు క్రమంగా రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఎవ్వరూ బలహీనమైన కట్టడాల్లో నివాసం ఉండకూడదని, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ప్రజలకు అధికారులు సూచించారు.

### కొప్పునూరు లో కలుషితంగా...

# మిషన్ భగీరథ నీరు

**- అనారోగ్యానికి గురవుతున్న గ్రామ ప్రజలు.**

**-చర్యలు తీసుకోవాలని గ్రామస్థు లు వినతి**



**టీ మీడియా, జులై 3, చిన్నంబావి:** చిన్నంబావి మండల పరిధి లోని కొప్పునూరు గ్రామం లో కలుషితమైన మిషన్ భగీరథ నీరు రావడం చేత గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.మిషన్ భగీరథ నీరు లో క్రిమి కీటకాల వస్తున్నాయి అని పలు మార్లు అధికారులకు పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు అని ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, తెలిపారు.ఆ నీరు లో పురుగులు ప్రవహించడం తో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదురుకోవడమే కాక భయాందోళనకు గురవుతున్నారు అని అన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామం లో ఇరువై సంవత్సరాల క్రితం కలుషిత నీటి ప్రవాహం వల్ల మలేరియా ప్రబలి గ్రామం లో ప్రజలు అనేక ఇబ్బందులకు గురియ్యారని అన్నారు.మరో సారి గ్రామం లో అలాంటి వ్యాధులు ప్రబల కుండా గ్రామాన్ని కాపాడాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు.ముఖ్యం గా మిషన్ భగీరథ నీళ్ల లో వివిధ రకాల క్రిమి కీటకాలు రాకుండా చూడాలని అన్నారు. పురుగుల నీరు ప్రవహించడంతో గ్రామం లోని ప్రజలు వివిధ రకాల ఆరోగ్య సమస్యల కు గురవుతున్నారని వాపోయారు. మిషన్ భగీరథ నీటిని వాడటం చేత శరీరం పై ఎర్రటి దద్దుర్లు ఏర్పడి అలర్జీలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారని అన్నారు.సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ అధికారులు గ్రామం లో ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గ్రామం లో ఉన్న ప్రాథమిక వైద్యశాలను వినియోగంలోకి తీసుకవచ్చి ప్రజలకు అందుబాటులో వైద్య సిబ్బంది ని ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజల తరుపున కోరుతున్నామని ఆమె అన్నారు.

## నేడు మహానందిలో ఎమ్మెల్యే పర్యటన



**టీ మీడియా, జూలై 3, మహానంది:**మహానంది మండలంలో శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి గురువారం పర్యటించనున్నారని తెలుగుదేశం పార్టీ మండల నాయకులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించు కుంటారన్నారు. అనంతరం మహానంది మండలంలోని థాంక్స్ ఫర్ ఓటింగ్ కార్యక్రమంలో భాగంగా, తమ్ముడపల్లె, అబ్బీపురం, గ్రామాల్లో పర్యటించి రచ్చబండ కార్యక్రమం నిర్వహించి, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. మండలంలోని ఎన్డీఏ కూటమి శ్రేణులు, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

## సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పరిశీలన

యు.కొత్తపల్లి పర్యటనకు వెళుతూ మార్గం మధ్యలో సూరప్ప చెరువు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. నాబార్డు నిధులతో 22 ఎకరాల్లో నిర్మించిన ఈ ట్యాంకు ద్వారా యు.కొత్తపల్లి మండల పరిధిలోని 54 గ్రామాలకు నీరు అందిస్తున్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, తాగు నీటిని శుభ్రపరిచే విధానం, ల్యాబ్ లు పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాకినాడ కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎంపీ ఉదరు శ్రీనివాస్, పిఠాపురం జనసేన ఇంఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్రపు కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళుతూ గ్రామ గ్రామాన ప్రజలను కలుస్తూ వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. పిఠాపురం, నవకంద్రవాడ, వాకతిప్ప, యు.కొత్తపల్లి తదితర గ్రామాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దారి పొడుగునా ప్రజలు పవన్ కల్యాణ్ కి స్వాగతం పలుకగా అందరికీ అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు. అనంతరం యండపల్లి జంక్షన్ వద్ద ఉన్న ఎస్సీ కాలనీని పవన్ సందర్శించారు. కాలనీ వాసులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంచి నీరు సదుపాయం కల్పించాలని ఈ సందర్భంగా స్థానికులు కోరారు. కొండెవరంలో ఆత్మహత్య చేసుకున్న చక్రధర్ కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. గమనించిన డిప్యూటీ సీఎం పవన్ కాన్వారు ఆపి వాళ్లతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జడ్పీ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎంవీ సత్యనారాయణ, డీపీవో కె .భారతి సౌజన్య, ఆర్డీవో ఇట్ల కిషోర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.




## పదిమంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

**టీ మీడియా, జులై 3, పెద్దపల్లి బ్యూరో :** మల్టీ జోన్ 1 పరిధిలో పనిచేస్తున్న పదిమంది ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఐజీ కార్యాలయంలో వెయిటింగ్ లో ఉన్న నాగపురి శ్రీనివాసును ఆర్మూర్ కు, ఆర్మూర్లో పనిచేస్తున్న రవికుమార్ ను ఐజి కార్యాలయానికి, వెయిటింగ్ లో ఉన్న ఆరిఫ్ అలీ ఖాన్ ను జగిత్యాల డిఎస్ బి కి, జగిత్యాల ఎస్ బి లో పని చేస్తున్న నాగేశ్వరరావును ఐజి కార్యాలయానికి, అశ్వరావుపేట లో పనిచేస్తున్న జితేందర్ ను ఐజి కార్యాలయానికి, ట్రాన్స్కో నుండి రిప్యాట్రియేషన్ పై వచ్చిన కృష్ణ ను సిరిసిల్ల టౌన్ కు, సిరిసిల్ల టౌన్ లో పనిచేస్తున్న రఘుపతి ని ఐజి కార్యాలయానికి, వెయిటింగ్ లో ఉన్న మొగిలి ని సిరిసిల్ల రూరల్ కు, సిరిసిల్ల రూరల్ లో పనిచేస్తున్న సదన్ కుమార్ ను ఐజి కార్యాలయానికి, సిద్దిపేట సిసిఆర్బి లో పనిచేస్తున్న గురు స్వామిని వరంగల్ కమిషనరేట్ కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



## మంత్రి శ్రీధర్ బాబుతో నోకియా జర్మనీ ప్రతినిధి బృందం భేటీ

**టీ మీడియా, జులై 3, హైదరాబాద్ బ్యూరో :** సచివాలయంలో తెలంగాణా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తో నోకియా జర్మనీ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యింది. ఈ భేటీలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొన్నారు. 5జీ నెట్వర్క్ ని మరింత అభివృద్ధి చేసి పూర్తిగా అన్ని రంగాలకు అందించాలని కంపెనీ ప్రతినిధులను మంత్రి కోరారు.విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్య అందించాలనే సంకల్పంతో క్వాడ్ జెన్ కంపెనీ వాళ్ళతో కలిసి ప్రతి పాఠశాలలో ఐడబ్ల్యూబీ ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. విద్యార్థులకు 20వేల లోపు ల్యాప్ టాప్స్ అందించే బృహత్తరమైన కార్యక్రమం చేపడుతున్నామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ భేటీలో నోకియా గ్లోబల్ హెడ్ మార్టీన్, సేల్స్ హెడ్ మ్యాన్క్స్, గ్లోబల్ డైరెక్టర్ వెంకట్, పద్మజ, రాజేష్, సీఎస్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్అండ్ బీ సెక్షన్‌లో....

# మంత్రి కోమటిరెడ్డి ఆకస్మిక తనిఖీలు..



**టి మీడియా జులై 3.హైదరాబాద్:** ఆర్ అండ్ బీ సెక్షన్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్ అండ్ బీ విభాగాన్ని మంత్రి పరిశీలించారు. సచివాలయంలో ఉద్యోగుల పనితీరును తెలుసుకునేందుకు మంత్రి వెళ్లారు. ఆర్ అండ్ బీ విభాగంలో ఆకస్మికంగా తనిఖీ చేయగా ఖాళీ కుర్చీలే దర్శనమివ్వడంతో షాక్ తిన్నారు. సమయం దాటినా చాలా మంది ఉద్యోగులు కార్యాలయానికి రాకపోవడంతో మంత్రి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణంగా ఉద్యోగులు ఉదయం 10 గంటలకు కార్యాలయానికి రిపోర్టు చేయాలి.తెలంగాణ సచివాలయంలో ఉదయం 11.00 గంటలు అయిన 80 శాతం ఉద్యోగులు ఆఫీసులకు రాకపోవడంపై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసిస్టెంట్, అడిషినల్ సెక్రటరీ స్థాయి అధికారులు కూడా ఆఫీసులకు ఆలస్యంగా రావడంపై ప్రశ్నించారు. 11కి రాలేదు.. మళ్లీ 6కి వెళ్లిపోతారు.. మళ్లీ మధ్యలో ఆఫ్ అంటూ.. అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటు పలు వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి.. కొన్ని విషయాలపై అధికారులు స్పందించకపోవడంతో మీ వివరాలు కూడా మీకు తెలుసా? అంటూ ఫైర్ అయ్యారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని వార్నింగ్ ఇచ్చారు. ఇలాగే కొనసాగితే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మంత్రి వచ్చిన ఇప్పటి వరకు ఉద్యోగులు రాకపోవడం ఏంటని మండిపడ్డారు. ఉద్యోగులు రోజూ ఇలానే వస్తున్నారా? అంటూ ప్రశ్నించారు. మొదటిసారి తనిఖీ కావడంతో.. వదిలేస్తున్నాని ఇదే మళ్లీ రిపీట్ అయితే.. చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఝార్ఖండ్ సీఎంగా మళ్లీ హేమంత్ సోరెన్



**టి మీడియా జులై 3. రాంచీ:** ఝార్ఖండ్ సీఎంగా మళ్లీ హేమంత్ సోరెన్ పగ్గాలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. జేఎంఎం సారథ్యంలోని కూటమి ఎమ్మెల్యే ఏకగ్రీవంగా ఆయన్ను సభాపక్ష నేతగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో దాదాపు 5 నెలల పాటు జైలులో ఉన్న ఆయన జూన్ 28న విడుదలైన నేపథ్యంలో ఇండియా కూటమి పార్టీల ఎమ్మెల్యేలు బుధవారం రాంచీలో ప్రస్తుత సీఎం చంపాయీ సోరెన్ నివాసంలో భేటీ అయ్యారు. మళ్లీ హేమంత్ సీఎంగా ఉండాలని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జి గులాం అహ్మద్ మీర్, ఆ పార్టీ అధ్యక్షుడు రాజేష్ ఠాకూర్ పాల్గొన్నారు. హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్, ఆయన సోదరుడు సోదరుడు బసంత్ కూడా ఉన్నారు. మరోవైపు మంగళ, బుధవారాల్లో సిట్టింగ్ సీఎం చంపాయీ సోరెన్ కీలక కార్యక్రమాలను రద్దు చేసుకోవడంతో రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద మార్పు చోటుచేసుకోబోతోందన్న ఊహాగానాలు చెలరేగాయి.

## స్వదేశానికి పయనమైన టీమిండియా..



**టి మీడియా జులై 3. హైదరాబాద్:** టీ20 ప్రపంచకప్ ముగిసినప్పటికీ బెరిల్ హరికేన్ కారణంగా బార్బడోస్‌లో చిక్కుకున్న టీమిండియా ఎట్టకేలకు తిరిగి స్వదేశానికి పయనమైంది. అక్కడున్న అడ్డంకులన్నీ తొలిగి, బీసీసీఐ ఏర్పాటు చేసిన ఎయిర్ ఇండియాకు చెందిన ప్రత్యేక ఛార్టర్ ఫ్లైట్‌లో బార్బడోస్ నుంచి రోహిత్ సేన ఢిల్లీకి బయలుదేరింది. వీరితో పాటు భారత్ కు చెందిన మీడియా ప్రతినిధులు కూడా ఉన్నారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) క్రికెటర్లు, వారి కుటుంబ సభ్యులు, కోచ్‌లు, మీడియా సిబ్బంది కోసం ఈ ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేసింది. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా బుధవారం సాయంత్రం బార్బడోస్ నుండి ప్రత్యేక చార్టర్డ్ ఫ్లైట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇక బీసీసీఐ కార్యదర్శి జై షా మొత్తం వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అటు ఏఎన్ఐ టీమిండియా ఆటగాళ్లు, సిబ్బంది బార్బడోస్‌లో విమానం ఎక్కుతున్న వీడియోను షేర్ చేసింది.

## పరిశుభ్రత కార్యక్రమం



**టీ మీడియా ,జులై 3,ఎండపల్లి :**మండలం కొత్తపేట గ్రామం మండల అధ్యక్షుడు హన్మంత రావు ఆధ్వర్యంలో వృక్షో రక్షతి రక్షితః మరియు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలను నాటలనె సంకల్పం తో బుధవారం మొక్కలను నాటే కార్యక్రమంను ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగ ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు .ఈ సందర్భంగా రాంబాబు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ చెట్లు నాటడం సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది అని మొత్తం మానవాళికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది అని చెట్లు మనకు ఆహారం,ఆక్సిజన్, వర్షాన్ని అందిస్తుందని,ఇంధనం, నివాసం,మనం జీవించడానికి కావలసిన ప్రతిదాన్ని అందిస్తాయి.చెట్లను నాటడం వల్ల కలిగే అన్ని ప్రయోజనాలను తో పాటు అన్ని జీవులు వాటిపై ఆధారపడతాయి కాబట్టి చెట్లను నాటడం వల్ల మనం ప్రకృతిని పెంచి భూతాపాన్ని తగ్గించడం వల్ల ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటుదని ప్రతి ఒక్కరు సమయం కేటాయించి చెట్లు నాటాలని పిలుపునిచ్చారు. అలాగే వర్షాకాలంలో ఇంటి చుట్టూ నీరు నిల్వ కుండా చూసుకోవాలి అని సీజనల్లో వచ్చే వ్యాదు లను అరికట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు దుర్గం రమేష్, భూత్ అధ్యక్షులు దుర్గం రంజిత్, గుండేటి మధుకర్, ఒరిగెల కుమార్, విష్ణు వర్ధన్ తధితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం

**-ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లెల చిన్నారెడ్డి**



**టీ మీడియా, జులై 3, వనపర్తి బ్యూరో :** వనపర్తి పట్టణంలో ప్రేమ్ టైలర్స్ మన్యం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి .చిన్నారెడ్డి మాట్లాడుతూ వినియోగదారులు ఎక్కువగా ప్లాస్టిక్ బ్యాగులు వాడుతున్నారు. దానివల్ల పర్యావరణ కాలుష్యానికి కారణం అవుతుంది. మనుషులు చనిపోయినప్పుడు శరీరం మట్టిలో కలిసిపోతుంది కానీ ప్లాస్టిక్ బ్యాగులు మట్టిలో కలిసిపోకుండా అలాగే ఉండిపోతున్నాయి.పశువులు ప్లాస్టిక్ సంచులను తిని అవి అరగక పశువులు చనిపోవడానికి కారణం అవుతున్నాయి.కావున ప్లాస్టిక్ బ్యాగులను అరికట్టి చేతి సంచులను వాడుకలోకి తీసుకురావాలి.ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, కదిరే రాములు యాదవ్ ,కోట్ల రవి, నందిమల్ల యాదయ్య, బి కృష్ణ, పరశురాం,రాములు యాదవ్, దివాకర్, రోహిత్, గడ్డం వినోద్,ఆవుల చంద్రశేఖర్,రణధీర్ రెడ్డి, సందీప్ రాము, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ గా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



**టీ మీడియా, జులై 3, వనపర్తి బ్యూరో :** జులై 4వ తేదీ నుండి వనపర్తి జిల్లా కలెక్టర్ గా అదనపు బాధ్యతలు నిర్వహించనున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తన వ్యక్తిగత కారణాల వల్ల జులై 4వ తేదీ నుండి జులై 25 వరకు సెలవు పై వెలుచున్నందున వారి స్థానంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ను జిల్లా కలెక్టర్ గా పూర్తి బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం ఉత్తర్వులు జారి చేశారు. సెలవు అనంతరం తిరిగి ఆదర్శ్ సురభి వనపర్తి కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## అభివృద్ధి ప్రదాత ఎంపీపీ కిచ్చారెడ్డి



**టీ మీడియా, జులై 3, వనపర్తి బ్యూరో :** వనపర్తి మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి సమస్యలు లేని గ్రామాలుగా ఎంపీపీ కిచ్చారెడ్డి తీర్చిదిద్దారని కాంగ్రెస్ నేతలు మాజీ కౌన్సిలర్ చుక్క రాజు, మలిదశ ఉద్యమకారుడు కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు, కాంగ్రెస్ నాయకులు బోయ మురళి అన్నారు. బుధవారం తో పదవీకాలం ముగిస్తుండడంతో ఆయన ఛాంబర్ లో కిచ్చారెడ్డి నీ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పూల బోకే అందజేసి శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధికి ప్రాధాన్య కల్పించిన ఎంపీపీ ఐదేళ్ల పదవీకాలంలో అభివృద్ధికి పాటుపడ్డాడని అన్నారు. ప్రతి గ్రామంలో సిసి రహదారులు డ్రైనేజీ వ్యవస్థ త్రాగునీటి సరఫరా బోర్ల ఏర్పాటు వంటి మౌలిక వసతులు కలపడంలో నిరంతరం కిచ్చారెడ్డి కృషి చేశారని ఆయన సేవలకు ప్రజల తరపున వారు కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమయ్యే ఎంపీపీ రాబోవు రోజులలో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజల సేవకు అంకితం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో , మెగా రెడ్డి యువ సైన్యం, వంశ మౌని మోహన్, ఆర్.టి కిరణ్, పోలేపల్లి మోహన్ రాజ్, ఏటీఎం మహేందర్, సుగూరు భాస్కర్, ప్రవీణ్, బీసన్న, చుక్క చింటూ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహానంది పరిసరాల్లో మరోసారి చిరుత కలకలం



**టీ మీడియా, జూలై 3, మహానంది:** మహానంది దేవస్థానం పరిసరాల్లో బుధవారం మధ్యాహ్నం చిరుత సంచారంతో గ్రామస్తులు, రైతులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. బుధవారం మధ్యాహ్నం సమయంలో చిరుత పెద్ద నంది ఎదురుగా ఉన్న పొలాలలో సంచరించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని మహానంది డిఆర్ఓ హైమావతికి తెలపగా, ఆమె పులి సంచరించిన స్థలాన్ని పరిశీలించి, పాదముద్రలు గుర్తించి,పులివె అని నిర్ధారించడం జరిగింది. చిరుత పులిని అటవీశాఖ అధికారులు త్వరితగతిన బంధించి అడవికి దూరంగా వదలాలని గ్రామస్తులు, భక్తులు ,రైతులు కోరుతున్నారు.

## మహానందిలో ఈఓ తనిఖీలు

**-ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు సస్పెండ్**



**టీ మీడియా, జూలై 3, మహానంది:**మహానంది క్షేత్రంలోని ప్రసాదం కౌంటర్లను ఈఓ నల్ల కాలువ శ్రీనివాస్ రెడ్డి బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లడ్డు స్టాక్ రిజిస్టర్ 304, లడ్డులు తక్కువగా ఉండడంతో పాటు,రూ.4,190 నగదు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు,ఇద్దరూ రెగ్యులర్ ఉద్యోగులైన రికార్డ్ అసిస్టెంట్ మహేశ్వరమ్మ, అటెండర్ కర్ణ బహుదూర్ లను సస్పెండ్ చేసి, అలాగే ఏజెన్సీ విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులు మహేష్, చింతల్, ప్రహ్లాదుడు లను తొలగిస్తూ ఈవో ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న ఉద్యోగులు, విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు ఓ. వెంకటేశ్వర్లు, మధు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్, ఎంపీటీసీ ల సమావేశం



**టి మీడియా జులై 3..పటాన్చెరు** నియోజకవర్గం జిన్నారం మండలం లో గత కొన్ని రోజుల క్రితం పదివి కాలం ముగిసిన బి ర్ స్ సర్పంచ్ లు మరియు జులై నెలలో ముగింపు కానునా బి ర్ స్ పార్టీ ఎంపీటీసీ ఓ ప్రైవేట్ పంక్షన్ హల్ లో సమావేశం కావడం జరిగింది ముఖ్య అతిది గా జిన్నారం మండలం జడ్పీటీసీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్, జిన్నారం మండలం ఉద్యమం నాయకులు వెంకటేష్ గౌడ్ ముఖ్య అతిగా విచ్చేసినారు ఈ సందర్భంగా 5 సంవత్సరాలనుండి గ్రామాలలో ప్రజలకు అందుభాటులో ఉండి ప్రజలకు సేవచేసిన సర్పంచ్ లకు మరియు ఎంపీటీసీ లకు జిన్నారం మండల బి ర్ స్ అధ్యక్షులు నాయికోటి రాజేష్ వారికి సన్మానం చేసి సర్పంచ్ లకు ఎంపీటీసీ లకు కృతజ్ఞతలు తెలపడం జరిగింది.

## నందీశ్వరునికి ప్రదోషకాల పూజలు



**టీ మీడియా, జూలై 03, మహానంది:** మహానంది క్షేత్రంలో మహా ప్రదోషం సందర్భంగా నందీశ్వరుడికి ప్రదోషకాలంలో వైభవంగా నందీశ్వరాభిషేకం వేద పండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో బుధవారం జరిపించారు.ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, నవదేవతాధ్యానం పీఠపూజా నంతరం అభిషేకం, అలంకారం,అర్చన మొదలగు వైదీక కార్యక్రమాలు వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

# ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

## -జూలై 12 వరకు జ్యుడిషియల్ కస్టడీ పొడిగింపు



**టీ మీడియా, జులై 3, ఢిల్లీ:** లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్‌కు మళ్లీ షాక్ తగిలింది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని జూలై 12 వరకు పొడిగించారు. ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టు బుధవారం (జూలై 3) జ్యుడీషియల్ కస్టడీ కాలాన్ని పొడిగిస్తూ తీర్పునిచ్చింది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో 2024 మార్చి 21న ఈడీ అరెస్టు చేసింది. కాగా, మెడికల్ బోర్డుతో సంప్రదింపుల సమయంలో తన భార్యను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా హాజరు కావడానికి అనుమతించాలని డిమాండ్ చేసిన సీఎం కేజ్రీవాల్ పిటిషన్‌పై కోర్టు తన నిర్ణయాన్ని రిజర్వ్ చేసింది. జులై 6న కోర్టు తీర్పు వెలువరించనుంది.ఢిల్లీ లిక్కర్ స్కాంలో కేజ్రీవాల్‌కు కష్టాలు రెట్టింపయ్యాయి. అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. సీబీఐకి సంబంధించిన కేసులో బెయిల్ మంజూరు చేయాలని సీఎం కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై త్వరగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై శుక్రవారం విచారణ జరగనుంది. సీఎం కేజ్రీవాల్‌ను అక్రమ నిర్బంధంలో ఉంచారని, చట్టాన్ని పాటించడం లేదని కేజ్రీవాల్ తరుపు న్యాయవాది రజత్ భరద్వాజ్ ఆరోపించారు.ఈ కేసులో గురువారం విచారణకు న్యాయవాది అప్పీల్ చేయగా, జస్టిస్ మన్మోహన్, "మొదట న్యాయమూర్తులు పేపర్‌లను చూడనివ్వండి.. ఆ తర్వాత కేసును మరుసటి రోజు విచారిస్తాం" అని తేల్చి చెప్పారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో సీఎం కేజ్రీవాల్‌కు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది రౌస్ అవెన్యూ కోర్టు. సీబీఐ కస్టడీ ముగిసిన వెంటనే సీబీ అరెస్ట్ చేసింది. మూడు రోజుల పాటు ఆయన్ను సీబీఐ విచారించింది. కస్టడీ ముగియడంతో కేజ్రీవాల్‌ను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చారు. కోర్టు కేజ్రీవాల్‌కు జులై 12 వరకు జ్యుడిషియల్ కస్టడీ విధించింది. దీంతో కేజ్రీవాల్‌ను మళ్లీ తిహార్ జైలుకు తరలించారు. కేజ్రీవాల్ విచారణకు సహకరించడం లేదని , తమ ప్రశ్నలకు కేజ్రీవాల్ పొంతనలేని సమాధానం చెప్పారని కోర్టుకు సీబీఐ తెలిపింది.అయితే సీబీఐ తప్పుడు ఆరోపణలు చేస్తోంది కేజ్రీవాల్ తరపు న్యాయవాది విక్రం చౌదరి తెలిపారు. సీబీఐ దగ్గర ఉన్న సాక్ష్యాలను వెంటనే కోర్టుకు సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సీబీఐ ఈ కేసులో ఇప్పటివరకు నాలుగు చార్జ్‌షీట్‌లు దాఖలు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో పాటు ఆప్ నేత మనీష్ సిసోడియాను కూడా నిందితులుగా పేర్కొన్నారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కేజ్రీవాల్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 19న అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ఆయనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఈడీ కస్టడీలోనే తీహార్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌ను అదే కేసులో సీబీఐ అరెస్ట్ చేసింది. కస్టడీ ముగియడంతో ఆయన్ను కోర్టులో హాజరుపర్చారు. మరోవైపు కేజ్రీవాల్ అరెస్ట్‌ను నిరసిస్తూ ఆప్ శ్రేణులు భారీ ఆందోళనలను కొనసాగిస్తున్నాయి.

# రత్నగిరి వేద విద్యార్థులకు డయేరియా

## - విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన



**టీ మీడియా, జులై 3, అన్నవరం (కాకినాడ) :** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం సత్యగిరి కొండపైన నిర్వహిస్తున్న ఆగమ పాఠశాలలో చదువుకుంటున్న వేద విద్యార్థులకు డయేరియా వ్యాధి సోకడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం వేద పాఠశాలలో కొంతమంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలు అవడంతో అస్వస్థతకు గురయ్యారు. సంఘటన గురించి ఆలస్యంగా తెలుసుకున్న సంబంధిత అధికారులు హుటాహుటిన దేవస్థానం ఆసుపత్రికి చేరుకున్నారు. డాక్టర్ శ్రీకాంత్, వైద్య సిబ్బందిని వేద పాఠశాల వద్దకు రప్పించి చికిత్స అందించారు. ఈ వేద పాఠశాలలో 32 మంది విద్యార్థులు చదువుతుండగా వీరిలో ఆరుగురు విద్యార్థులకు డయేరియా వ్యాధి లక్షణాలు కనపడటంతో వీరికి దేవస్థానం వైద్య సిబ్బంది వేద పాఠశాలలోనే చికిత్స అందిస్తున్నారు. అయితే ఈ వ్యాధి అంటువ్యాధి అని తెలిసినప్పటికీ సంబంధిత అధికారులు మిగిలిన విద్యార్థులకు వ్యాధి సోకకుండా అక్కడినుండి వేరే ప్రాంతానికి తరలించకుండా ఆ వేద పాఠశాలల్లోనే ఉంచడం పట్ల అధికారుల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు, అక్కడి ప్రజలు మండిపడుతున్నారు. కాగా వేద విద్యార్థులు అస్వస్థతకు గురి కావడానికి మరి కొంతమంది ఇతర కారణాలు చెబుతున్నారు. సంబంధిత వేద పాఠశాల కొండల్లో ఉండడం వలన పాములు, తేళ్ళు వంటి విషపూరిత కీటకాలు సంచారం చేస్తుంటాయని, వాటినుండి విద్యార్థులు ప్రమాదాలలో లోను కాకుండా గడ్డి మందు, పాములుండే స్థలాల ముందు సిబ్బంది (స్ప్రే) కొట్టడం వలన ఈ విషయం తెలియని కొంతమంది వేద విద్యార్థులు ఆ ప్రాంతంలో ఆడుకునే క్రమంలో %%%, ఈ గడ్డి మందు పీల్చడం వలన అస్వస్థతకు గురైనట్లు సమాచారం. దీనిపై దేవస్థానం ఆసుపత్రి డాక్టర్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా కొంతమంది వేద విద్యార్థులకు డయేరియా వ్యాధి లక్షణాలు ఉన్నాయని, వీరందరికీ ప్రథమ చికిత్స అందించామని ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదం లేదని ప్రజాశక్తికి తెలిపారు.

# ఎమ్మెల్యే కి సమస్యల స్వాగతం

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
-నల్లమల ఘాట్ లో ప్రమాదాలు
-ప్రభుత్వం, ఎమ్మెల్యే వైపు ప్రజలు చూపులు



**టీ మీడియా, జూలై 3, మహానంది:**మహానంది మండలంలో శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి అనేక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గత ప్రభుత్వంలో అధికారులు, పాలకులు సమస్యలు పట్టించుకోకపోవడంతో, ఆ సమస్యలు సమస్యగానే మిగిలిపోయాయి. దీంతో గాజులపల్లి గ్రామంలోని మెట్ట యందు డ్రైనేజీ వ్యవస్థ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. డ్రైనేజీ గురించి పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని, పారిశుధ్యం లోపించి, దోమలు వృద్ధిచెంది, ప్రజలు రోగాల బారిన పడుతున్నామని, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ కాలువలు నుండి మురుగునీరు ఇండ్లలోకి వస్తున్నాయని, కాలువలో మురుగు నిలిచి ఉండటంతో దుర్వాసన వస్తోందని, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ మురుగునీరు ముందుకు సాగే విధంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందుల పరిస్థితులు ఏర్పడ్డాయి. గాజులపల్లి గ్రామ పరిధిలోని మహాదేవపురం వెళ్లే రసాయందు నిత్యం ప్రజలు వారి అవసరాలకు బయటకు రావాలంటే నరకయాతన పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసిన ఈ రహదారి యందు, డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో, రోడ్డుపై వర్షపు నీరు నిలబడి నీటి కుంట ను తలపిస్తుంది. ఈ రహదారిలో ప్రయాణం సాగించాలంటే, వాహనదారులు ఇవా ఇబ్బందులు పడుతున్నారు. మహానంది మండలంలోని శ్రీనగరం –తిమ్మాపురం రహదారి అధ్వానంగా తయారైంది. అదేవిధంగా గాజులపల్లి–గిద్దలూరు జాతీయ రహదారి గాజులపల్లి గ్రామం వద్ద గుంతలమయంతో ఉంది. తిమ్మాపురం గ్రామం నుండి జమాలయ్య దర్గా మార్గం కూడా గుంతలతో అధ్వానంగా ఉంది. నందిపల్లి గ్రామం నుండి సూర్యనంది ఆర్చి వరకు దారి కూడా చాలా దయనీయంగా ఉంది.అబ్బీపురం గ్రామం లో శివాలయం నుండి దుర్గగుడి వద్దకు రోడ్డు చాలా దయనీయంగా ఉంది. మహానంది క్షేత్రానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. వర్షం కురిసినప్పుడు గుంతలలో నీరు నిలబడి, నీటి కుంటలను తలపిస్తున్నాయని,క్షేత్రానికి వెళ్లే భక్తులు, వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.ఈ గుంతల వల్ల ప్రయాణం చాలా కష్టంగా ఉంటుందని, రైతులు, భక్తులు, వాహనదారులు వాపోతున్నారు మహానంది మండలంలోని అన్ని గ్రామాలలో సైడ్ కాలువలు సరిగ్గా లేక, మురికి నీరు పోయే దారి లేక డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లుతున్నాయి.నంద్యాల గిద్దలూరు జాతీయ రహదారి నల్లమల్ల అడవి ప్రాంతంలో ప్రమాదాలు జరిగినప్పుడు పోలీసు, రెవెన్యూ, రహదారుల భవనాల శాఖ వారు సహకరించాల్సింది ఉంది. అయితే ఈ నల్లమల అడవి ప్రాంతంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరిగిన గాని, కనీసం ప్రమాదాల్లో కనీసం మంచినీరు కూడా, అందించలేక పోతున్న పరిస్థితులు ఎన్నో ఉన్నాయి. గంటల కొద్ది ట్రాఫిక్ జాముల్లో రేయి పగలు అక్కడే దారి మధ్యలో ఇరుక్కుని పోయినా కూడా, పట్టించుకున్నట్లు దాఖలాలు లేవు.మహానంది మండలంలో అన్ని గ్రామాలలో త్రాగునీటి ట్యాంకులు శుభ్రతకు నోచుకోకుండా అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఈ కలుషిత నీరు తాగడం వలన గ్రామస్తులు అనారోగ్య పాలవుతున్నారు. నీటి ట్యాంకులు శుభ్రత లేకపోవడం వలన నీరు కలుషితమై అనేక రోగాలకు కూడా దారితీస్తుందని మండల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెలకొన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పైన ప్రజలు కొండంత ఆశలు పెట్టుకున్నారు. శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి రాకతోనైనా, మహానంది మండలంలో సమస్యల పరిష్కారానికి, కృషి చేస్తారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### యూనిఫాం పక్కన పెట్టి..

## రైలు కిందపడి ఏఎస్సై ఆత్మహత్య



**టి మీడియా, జూలై 3,హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ లోని వైఎస్సార్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. నైట్ డ్యూటీ చేసి ఉదయాన్నే ఇంటికి బయలుదేరిన ఓ ఏఎస్సై మార్గమధ్యంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. యూనిఫాం విప్పి జాగ్రత్తగా పక్కన పెట్టి రైలు కిందపడి చనిపోయాడు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు.. ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జిల్లాలోని కమలాపురం పోలీస్ స్టేషన్ లో నాగార్జున రెడ్డి ఏఎస్సైగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధుల్లో ఉన్న నాగార్జున రెడ్డి.. బుధవారం ఉదయం డ్యూటీ ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. కానీ ఇంటికి మాత్రం చేరుకోలేదు. మార్గమధ్యంలో వల్లూరు మండలం తాటిగొట్ల సమీపంలోని తప్పెట్ల బ్రిడ్జి వద్ద రైలు పట్టాలపై నాగార్జున రెడ్డి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పట్టాలకు దగ్గర్లోనే నాగార్జున రెడ్డి యూనిఫాం పడి ఉందని, ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని పోలీసులు చెప్పారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై కొత్త చట్టంలో కేసు

**టీ మీడియా,జులై 3,హుజురాబాద్ :**



హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు అయింది. భారత్ న్యాయ సంహిత చట్టంలో కేసు నమోదు అయిన మొట్టమొదటి ఎమ్మెల్యేగా పాడి కౌశిక్ రెడ్డి రికార్డు సృష్టించారు. జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే వ్యవహరించిన తీరుపై ఫిర్యాదు చేశారు జడ్పీ సిఈవో. కలెక్టర్ పమేలా సత్పతి బయటికి వెళ్ళే సమయంలో అడ్డుకుని బైఠాయించారు ఎమ్మెల్యే కౌషిక్ రెడ్డి. ఈ తరుణంలోనే%%% భారత్ న్యాయ్ సంహిత యాక్ట్ ప్రకారం సెక్షన్ 221,126 (2ఊ ల హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు అయింది. బీఎన్ఎస్ చట్టం అమలు లోకి వచ్చిన రెండవ రోజే హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు అయింది. కాగా నిన్న కరీంనగర్ జిల్లా పరిషత్ సమావేశంలో కౌశిక్ రెడ్డి విశ్వరూపం చూపిం చారు. డీఈఓను సస్పెండ్ చేయా లంటూ నిరసన తెలిపారు. ఒక ఎమ్మెల్యేగా ఎడ్యుకేషన్ అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించే అర్హత మాకు లేదా? అని ప్రశ్నించారు.

## వన మహోత్సవాన్ని ప్రారంభించిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే విజయరమణరావు



**టీ మీడియా, జులై 3,పెద్దపల్లి బ్యూరో :**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణ శ్రీ, అటవీ శాఖ అధికారులతో, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ అధికారులు మరియు ప్రజా ప్రతినిధులతో కలిసి చెట్లను నాటిఐటి, పరిశ్రమల శాఖల మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి శాసనసభ్యులు . చింతకుంట విజయరమణ రావు వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారుమంత్రి శ్రీధర్ బాబు ,ఎమ్మెల్యే విజయరమణ రావు.వారు మాట్లాడు తు చెట్లను నాటే విషయంలో అలాగే మొక్కల పంపిణీ విషయంలో పలు సూచనలు సలహాలు అందించి పూర్తి స్థాయిలో మొక్కల సంరక్షణ చేసి వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే పెద్దపల్లి మున్సిపల్ లో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేసి గతంలో చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకుంటూ మొక్కల పెంపకం మరియు వాటి సంరక్షణను ఎప్పటికప్పుడు రికార్డు చేసుకోవాలని ఇంటింటా తిరిగి మొక్కలపై సర్వే చేయాలని విద్యుత్ తీగల క్రింద మొక్కలు నాటి ఇబ్బంది పడవద్దు అని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో. మున్సిపల్ చెర్మన్, జెడ్పీటీసీ లు, అటవీ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్ అధికారులు, డి.ఆర్.డి.వో, జెడ్పీ సీఈఓ, పట్టణ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, పోలీసులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద వ్యక్తుల కోసం తనిఖీ




**టీ మీడియా,జులై 3, గోదావరిఖని ప్రతినిధి:** నిత్యం బ్యాంకు సమీపంలో చోరీలకు పాల్పడుతున్న నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషన ర్ ఎం.శ్రీనివాస్ ఆదేశాల మేరకు పెద్దపల్లి డిసిపి, గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి ముమ్మర తనిఖీలు చేపట్టారు. గోదావరిఖని పట్టణంలోని పలు బ్యాంకుల వద్ద నగదు అవసరం ఉన్నవారు తీసుకెళ్లే క్రమంలో వాళ్ల వద్ద నుంచి అపరిచితులు దొంగతనం చేయడం, ఏటీఎం చోరీలకు పాల్పడుతున్న నేపథ్యంలో అనుమానాస్పద వ్యక్తులను పోలీసులు తనిఖీ చేపట్టారు. పలువురు అనుమానాస్పద వ్యక్తులను విస్తృతంగా తనిఖీలు చేపట్టి వివరాలు సేకరించారు. బ్యాంకుల వద్ద భద్రత ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, అత్యవసర పరిస్థితుల్లో అలారం సిస్టంను పరిశీలించారు. బ్యాంకు సిబ్బందికి అనుమానాస్పద వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే డయల్ 100 చేసి పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ,కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి



**టీ మీడియా జులై 3 గోదావరిఖని ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బిజెపి మహిళా మోర్చా ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో బుధవారం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమారపు లావణ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు పూర్తికావస్తున్నప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. మహిళలకి మహాలక్ష్మి పథకం, నవవదుకు తులం బంగారం, 18 సంవత్సరాలు నిండిన కాలేజీ అమ్మాయిలకి స్కూటీలు, విద్యార్థికి ఐదు లక్షల హామీ కార్డు, మహిళలకు పెన్షన్ రూ 4000 బకాయిలతో సహా వెంటనే చెల్లించాలని, ఈ పథకాలను వెంటనే అమలు చేయాలని, లేనియెడల పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

## 5జి నెట్వర్క్ మరింత అభివృద్ధి



**టీ మీడియా,జులై 3,గోదావరిఖని ప్రతినిధి:** హైదరాబాద్ సచివాలయంలో నోకియా 5జి నెట్వర్క్ జర్మనీ ప్రతినిధి బృందాన్ని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో మర్యాదపూర్వకంగా కలిసి సమావేశం అయ్యారు.5జి నెట్వర్క్ మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్యను అందించే దిశగా ఇంట్రాక్టివ్ వైట్ బోర్డ్స్ ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీలు తెలిపారు. దీంతో సుమారు 20వేల మంది విద్యార్థులకు ల్యాప్ టాప్ అందజేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నోకియా గ్లోబల్ హెడ్ మార్టిన్ సేల్స్ హెడ్ మెన్స్ మ్యాన్ డైరెక్టర్ వెంకట్, పద్మజ రాజేష్, సిఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పూలమాల వేసి నివాళులర్పించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**టీ మీడియా, జులై 3, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురం మండలం సోలిపూర్ గ్రామానికి చెందిన తినేటి గోపాల్ రెడ్డి తల్లి తినేటి సత్యమ్మ సంవత్సరీకానికి హాజరైన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించినారు. ఈ కార్యక్రమంలో సోలిపూర్ గ్రామానికి చెందిన మండల రైతు సంఘం అధ్యక్షుడు కే బాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీలను ఎంపీపీని జెడ్పిటిసిని సన్మానించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**టీ మీడియా, జులై 3, వనపర్తి బ్యూరో :** ఖిల్లా ఘనపురం మండల కేంద్రంలో ఖిల్లా ఘణపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి , ఎం రాజేంద్రప్రసాద్ యాదవ్ వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఖిల్లా ఘనపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ సమావేశంలో పాల్గొని నేటితో ఎంపిటిసిల ఎంపీపీల జెడ్పిటిసిల పదవి కాలం ముగిసిన సందర్భంగా ఎంపీపీ, ఎంపీటీసీలను శాలువా కప్పి ఘనంగా సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎమ్మార్వో, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్లో ఉన్న సిఎం రిలీఫ్ ఫండ్స్ మంజూరు చేయాలి

### ు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ



**టీ మీడియా, జులై 3, వనపర్తి బ్యూరో :** వనపర్తి నియోజకవర్గంలో తన హయాములో 2018 డిసెంబర్ నుండి 2023 నవంబర్ వరకు 5సంవత్సరాలలో దాదాపు 17వేల ముఖ్యమంత్రి సహాయనిధులు లబ్దిదారులకు అందజేయడం జరిగింది. ఈ నిధులు నాటి ముఖ్యమంత్రి హోదాలో కె.సి.ఆర్ మంజూరు చేశారని ఇంకా 1500 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని అందులో 500 దరఖాస్తుల సహాయ నిధులు మంజూరు అయి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.మంజూరు అయిన చెక్స్ జిల్లా కలెక్టర్ ద్వారా పంపిణీ చేయాలని లేదంటే నేరుగా లబ్ధిదారులకు పోస్ట్ ద్వారా అందజేయాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ విజ్ఞప్తి చేశారు. మంజూరు అయిన సి.ఎం రిలీఫ్ ఫండ్స్ నేను దరఖాస్తు చేయగా మంజూరు అయినాయి అని వాటిని నేటి ఎం.ఎల్. ఎ తాను మంజూరు చేసినట్లు పంపిణీ చేయడాన్ని నేను అక్షేపిస్తున్నాను. కాబట్టి కలెక్టర్ ద్వారా కానీ నేరుగా లబ్ధిదారులకు పోస్ట్ ద్వారా గాని అందజేయాలని లేఖలో పేర్కొన్నారు.అదేవిధంగా పెండింగ్లో ఉన్న 1000 దరఖాస్తుల సి.ఎం రిలీఫ్ ఫండ్స్ త్వరగా మంజూరు చేయగలరని విజ్ఞప్తి చేస్తూ మంజూరు చేయలేని యెడల దరఖాస్తులు,లబ్దిదారులకు నేరుగా పంపిస్తూ కారణాలు వివరించాలని లేఖలో పేర్కొన్నారు.నా విజ్ఞప్తి మన్నిస్తారని లేఖలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.




# చర్చలో పాల్గొనే ధైర్యం లేక విపక్షాలు వాకౌట్ చేశాయ్

-రాజ్యసభలో ప్రధాని మోదీ

**టి మీడియా, జూలై 3, ఢిల్లీ:** రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలుచేశారు. 3వసారి ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఎన్నుకుని.. ప్రజలు గొప్ప నిర్ణయం తీసుకున్నారంటూ మోదీ పేర్కొన్నారు. ప్రజల నిర్ణయాన్ని తక్కువచేసి చూపే ప్రయత్నం చేస్తున్నారంటూ కాంగ్రెస్ సహా విపక్షాలపై మండిపడ్డారు. తమ పాలనకు పదేళ్లు ముగిశాయి, ఇంకా 20ఏళ్లు మిగిలి ఉందంటూ మోదీ పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంలో భాగంగా రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగం దేశప్రజలకు ప్రేరణ.. కలించాయని.. దశాబ్దాల తర్వాత దేశంలోని ప్రజలు వరుసగా మూడోసారి సేవ చేసే అవకాశాన్ని కల్పించారని ప్రధాని మోదీ అన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభలో రచ్చచోటుచేసుకుంది.. విపక్షాల నినాదాల మధ్యనే ప్రధాని మోదీ ప్రసంగించారు.తమ విజయాన్ని చూసి కాంగ్రెస్ ఓర్వలేకపోతోందని.. దేశ ప్రజలు మమ్మల్ని పెద్దమనసుతో ఆశీర్వదించారంటూ ప్రధాని మోదీ పేర్కొన్నారు. తమపై విషప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టారని.. అంబేద్కర్ రాజ్యాంగం వల్లే తనలాంటి సామాన్యులు పార్లమెంట్ దాకా రాగలుగుతున్నారన్నారు. రాజ్యాంగం అంటే ఆర్టికల్స్ సమ్మిళితం మాత్రమే కాదు.. రాజ్యాంగంలో ప్రతీవాక్యం మహత్తరమైనది.. రాజ్యాంగం మనందరికీ మార్గదర్శకం అంటూ పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి విలువైనదని.. దీపస్తంభంలా పనిచేస్తుందన్నారు. నవంబరు 24న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్ణయించినప్పుడు ఇక్కడ రాజ్యాంగాన్ని ప్రదర్శిస్తున్న వారు వ్యతిరేకించారంటూ విపక్షాలపై మండిపడ్డారు.ఈ ఎన్నికల ఫలితాలు పదేళ్ల ప్రగతికి నిదర్శనమే కాదు.. రాబోయే కాలంలో జరిగే అభివృద్ధికి ఈ ఫలితాలు సంకేతమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాబోయే ఏదేళ్లలో ఎన్నో నిర్ణయాలు తీసుకుంటామని.. రాబోయే కాలంలో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఇది ప్రతి ఒక్కరిపై ప్రభావం చూపుతుందని.. ప్రతి తరగతికి అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇది మాత్రమే కాదు, మూడవ స్థానానికి రావడం ప్రపంచ స్థాయిలో అపూర్వమైన మార్పులను కూడా తీసుకువస్తుందన్నారు.ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని.. రిమోట్ ప్రభుత్వాన్ని నడపడం కాంగ్రెస్‌కు అలవాటు అంటూ ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఆటో మోడ్ ప్రభుత్వాన్ని కోరుకుంటోంది.. రిమోట్ ప్రభుత్వాన్ని నడపడం ఆ పార్టీకి అలవాటైందంటూ చురకలంటించారు.పెద్దల సభను విపక్షాలు అవమానిస్తున్నాయని.. ఓడించినా వారి బుద్ధి మారలేదని మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. 140 కోట్ల భారతీయులను విపక్షం మోసం చేసిందన్నారు. చర్చలో పాల్గొనే ధైర్యం లేక విపక్షాలు వాకౌట్ చేశాయని ఫైర్ అయ్యారు. నిజాలు చెబుతుంటే విపక్షాలు ఓర్వలేకపోతున్నాయని తెలిపారు. పంటల కొనుగోళ్లలో ఎన్నో రికార్డులు సృష్టించామన్నారు. %మీరా%లో కూడా రికార్డు కొనుగోళ్లు జరిగాయని.. రైతులకు సాధికారత కల్పించేందుకు కృషి చేస్తున్నామని మోదీ తెలిపారు. రైతు సంక్షేమమే మా ప్రణాళికలో ప్రధానాంశమని.. రైతులను ఇబ్బందులకు గురిచేయడానికి తాము ఎప్పుడూ అనుమతించలేదంటూ పేర్కొన్నారు.

**విపక్షాలపై చైర్మన్ ధన్కర్ ఫైర్..**

రాజ్యసభలో ప్రధాని మోదీ విపక్షాల నినాదాల మధ్యనే ప్రసంగించారు.. అబద్దాలను చెప్పొద్దని.. తమను మాట్లాడనివ్వాలని విపక్షసభ్యులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో విపక్షాలు మోదీ ప్రసంగిస్తుండగానే వాకౌట్ చేశారు. కాగా.. విపక్షాల వాకౌట్, సభ్యుల తీరుపై రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి ధనకడ్ సైతం ఆగ్రహం వ్యక్తంచేశారు. విపక్షాలు రాజ్యాంగాన్ని అవమానిస్తున్నాయని.. ఇకనైన తీరును మార్చుకోవాలని సూచించారు.



# మురుగు నీటితో ముంపుకు గురవుతున్న వాడ

**టీ మీడియా, జులై 3, వనపర్తి బ్యూరో :** వనపర్తి పట్టణంలోని ఇందిరా కాలనీలో రోజురోజుకు మురుగు నీరు సమస్య పెరుగుతూనే ఉంది. కాలనీలోని కాలువల ద్వారా వచ్చే మురుగునీరు ఒక దగ్గర చేరి నిల్వ ఉంటుంది. మున్సిపాలిటీ వారు మురుగు నీరు సాఫీగా పోకుండా డిస్పెంటల్ మట్టిని అడ్డుగా వేయడం వల్ల నిరంతరం వచ్చే మురుగు నీరు భూమి ఉపరితలానికి ఎగబాకి అక్కడ ఉన్న కాలనీలోని వాకిళ్లలోకి ఇళ్లల్లోకి చేరే అవకాశం రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ఆ మురుగునీరు ద్వారా కాలనీలోని ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. నిల్వ ఉన్న మురుగునీరు ద్వారా దోమలు అధికమై ఆ కాలనీ ప్రజలకు డెంగ్యూ మలేరియా లాంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది మరుగు ప్రాంతాలలో విష సర్పాలు సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో విష సర్పాలు ఇళ్లల్లోకి వచ్చే ప్రమాదం కూడా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కాలనీవాసులు అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్న ఈ సమస్యను పరిష్కరించే నాథుడే లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి ఆ కాలనీ ప్రజలు రోగ బారిన పడకుండా విషసర్పాల ద్వారా ప్రాణ నష్టం జరగకుండా న్యాయం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ఆంజనేయులు మహారాజ్ డిమాండ్ చేశారు.